క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

అడ్డాకుల: నిరుపేద కుటుంబాలకు చెందిన యువతుల వివాహాలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలతో ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తోందని ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రానికి చెందిన లబ్ధిదారులకు శుక్రవారం చెక్కులను అందజేశారు. విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, ఎంపీటీసీ రంగన్నగౌడ్, కోఆప్షన్ ఖాజాఘోరీ, చంద్రమోహన్‌రెడ్డి, పాల్గొన్నారు.

నేడు పంపిణీ

మహమ్మదాబాద్: మండలపరిధిలోని లబ్ధిదారులకు శనివారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ యేసయ్య తెలిపారు. ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి చేతుల మీదుగా చెక్కులు ఇవ్వనున్నట్లు వివరించారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

నవాబుపేట: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య తెలిపారు. మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో శుక్రవారం హరితహారం నిర్వహించారు. పాలకవర్గం, తదితరులు మొక్కలు నాటారు. శనివారం నిర్వహించనున్న కోటి వృక్షార్చన విజయవంతం చేయాలని కోరారు. సర్పంచ్ గోపాల్‌గౌడ్, కోఆప్షన్ తాహేర్, మార్కెట్ వైస్ చైర్మన్ చందర్, పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడంలోనే తృప్తి

గండేడ్: నిరుపేదలకు సేవ చేయడంలోనే ఎనలేని తృప్తి ఉంటుందని జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు హరిందర్ రావు పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో తన తాత సురేందర్, నాయనమ్మ అనసూయల జ్ఞాపకార్థం నిరుపేదలకు ఫ్యాన్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ బాలయ్య, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్ చారి పాల్గొన్నారు.

27న సమావేశం

పాలమూరు: హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఈనెల 27న(ఆదివారం) మున్నూరు కాపు సంఘం ప్లీనరి సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి మున్నూరు కాపులు అధికంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఘన సన్మానం



భూత్పూర్: పట్టణంలోని పాలమూర్ సీడ్స్‌లో మండల రూరల్ అధ్యక్షుడు రాంరెడ్డిని శుక్రవారం బీజేపీ రాష్ట్ర నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కర్వెనకి చెందిన ఆయన ఇటీవల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నేపథ్యంలో కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.సుదర్శన్ రెడ్డి, ఎగ్గని నర్సింహులు, రవీందర్‌రెడ్డి, దేవరకద్ర బాలన్న, పట్టణ అధ్యక్షుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అండగా నిలవండి

జడ్చర్ల: సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న తమ ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇచ్చి అండగా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బాదేపల్లి గంజ్‌లోని వ్యాపార సంఘం భవనంలో ఆయనకు మరోసారి టికెట్ కేటాయించడాన్ని హర్షిస్తూ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మార్కెట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

హన్వాడ: తహసీల్దార్ కిష్ట్యనాయక్ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని శుక్రవారం సూచించారు. శనివారం మండలంలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు.

ఉపాధ్యక్షురాలిగా శకుంతల

అడ్డాకుల: గుడిబండకి చెందిన శకుంతలను మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా నియమించారు. ప్రస్తుతం ఆమె గుడిబండ ఎంపీటీసీ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా శకుంతల పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

జడ్చర్ల టౌన్: మీసేవ నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలంటూ శుక్రవారం రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు స్థానిక నాయకులు తహసీల్దార్ శ్రీనివాసులు వినతి పత్రం సమర్పించారు. ఉచిత కరెంట్, కమీషన్ల పెంపు, ఇన్సూరెన్స్ వంటి వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి కూడా వినతి అందించారు.

హన్వాడ: మండలంలో మీసేవా నిర్వాహకులు శుక్రవారం తహసీల్దార్ కిష్ట్యనాయక్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. శంకర్‌నాయక్, కార్తీక్, రాజు, ఖాదర్, షాజీద్ పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో నాగుల విగ్రహాలకు పాలు పోస్తున్న మహిళలు



జడ్చర్ల యాగమహోత్సవంలో ..



అమిస్తాపూర్ ఆంజనేయ స్వామి ఆలయంలో..

వరలక్ష్మీ నమోస్తుతే..



వెన్నాచేడ్‌లో ..



జిల్లాకేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో బారులుతీరిన భక్తులు

సాక్షినెట్‌వర్క్ : శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంతో పాటు మండలాలు, గ్రామాల్లో వరలక్ష్మి వ్రతాలను వైభవంగా నిర్వహించారు. వరలక్ష్మి దేవిని అందంగా రకరకాల పూలతో అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. అనంతరం వాయినాలు అందించారు.

❒ జడ్చర్లలోని అమ్మవారి ఆలయాలు, విశ్వశాంతి యాగ మహోత్సవం ప్రాంగణంలో శ్రావణ శుక్రవారం శోభ వెల్లివిరిసింది. ఈ సందర్భంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఆచరించారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి, సకలదేవతల, సంతోషి మాత, భాగ్యేశ్వర, 44వనెంబరు జాతీయరహదారిపై ఉన్న లలితాంబికా, కావేరమ్మపేట భవాని మాత ఆలయాల్లో వేడుకలు నిర్వహించారు. యాగమహోత్సవంలో విశేష చండీసహిత నవదుర్గ హోమాలు జరిపించారు. సాయంత్రం విశేష లక్ష గాజులార్చన, కోటికుంకుమార్చనలు జరిపించారు.

❒ గండేడ్ మండలంలోని వెన్నాచేడ్, పగిడ్యాల్, కొంరెడ్డిపల్లి, పెద్దవార్వాల్, సల్కర్‌పేట్, బల్సుర్‌గొండ గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు.

❒ నవాబుపేట మండలకేంద్రంలోని శివాలయం, ఇప్పటూర్ శివాంజనేయస్వామి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు, కుంకుమార్చనలు చేశారు. చిన్నచింతకుంట మండల కేంద్రంలోని ఈశ్వర ఆలయంలో వేడుకలకు పూజారి చంద్రశేఖర్‌తో పాటు గ్రామస్తులు తదితరులు హాజరయ్యారు.

❒ భూత్పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో వేడుకలు వైభవంగా నిర్వహించారు.

❒ రాజాపూర్ మండల కేంద్రంలోని శివసీతారామాంజనేయస్వామి దేవాలయంతో పాటు గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు.

❒ అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని గ్రామాల్లో శుక్రవారం మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఆచరించారు.

❒ దేవరకద్రలో వాసవీమాత ఆలయంలో అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన, పల్లకీసేవ లలితా సహస్ర పారాయణం చేశారు.

❒ బాలానగర్ మండల పరిధిలోని గ్రామాల్లో వైభవంగా వేడుకలు నిర్వహించారు.



జడ్చర్ల సంతోషిమాత ఆలయంలో ..



ఉడిత్యాలలో..



రాజాపూర్‌లో..



చిన్నచింతకుంటలోని ఈశ్వర ఆలయంలో..



జిల్లాకేంద్రంలో వాయినాలు ఇచ్చుకుంటున్న మహిళలు



భక్తితో నమస్కరిస్తున్న మహిళ



దేవరకద్రలో..



మూసాపేటలో..

మహబూబ్‌నగర్ అసెంబ్లీకి కొత్వాల్ దరఖాస్తు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేయడానికి సీనియర్ నాయకుడు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కొత్వాల్ తరుపున పలువురు కాంగ్రెస్ నాయకులు దరఖాస్తు అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, జిల్లా మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు బెక్కరి అనిత పాల్గొన్నారు.

మిడ్జిల్: మల్లాపూర్‌కి చెందిన కొప్పుల మధు జడ్చర్ల ఎమ్మెల్యే టికెట్ కోసం శుక్రవారం దరఖాస్తు చేసుకున్నారు. నాయకులు నవీన్, మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

అడ్డాకుల: కన్మనూర్ పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ ఘన్సీరాం సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించి బీఎల్‌ఓతో ఓటరు జాబితా గురించి మాట్లాడారు. శని,ఆదివారాల్లో రెండు రోజుల పాటు బీఎల్‌ఓలు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. ఫారం 6, ఫారం 8కి సంబంధించిన దరఖాస్తులను సేకరించాలని సూచించారు. మరణించిన ఓటర్ల వివరాలను సేకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గిర్దావర్ సాహత్ ఇషాన్ తదితరులు ఉన్నారు.

ఫైనాన్స్ కంపెనీలను నియంత్రించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఫైనాన్స్ కంపెనీల అక్రమ వ్యాపారాన్ని నియంత్రించాలని క్యాప్స్ జిల్లా అధ్యక్షుడు అడమ్స్ అన్నారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆజమాయిషీ లేకపోవడంతో కస్టమర్ల నుంచి చక్రవడ్డీ, బారువడ్డీలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో వెంకట్‌రెడ్డి, వెంకటేష్, విజయ్‌మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

చెరువులను ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు

భూత్పూర్: తాటిపర్తి చెరువులను, కుంటలను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం తహసీల్దార్ భాను కిరణ్‌కు గ్రామానికి చెందిన మత్స్య సహకార సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని కొంతకుంట, గొల్లవాని కుంట, ఊరకుంట, కుమ్మరివాని కుంట, మొగుళ్ల కుంట, వడ్లవాని కుంటలను కొందరు వ్యక్తులు ఆక్రమించి చదును చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఏటా 11 కుంటలకు రూ.16వేలు శిస్తు చెల్లిస్తున్నామని, సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, టి.శేఖర్ తదితరులు ఉన్నారు.

'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

జడ్చర్ల టౌన్: అర్హులైన పేదలకు డబుల్‌బెడ్‌రూంలు తక్షణమే ఇవ్వాలని, గృహలక్ష్మి పథకాన్ని రూ.5లక్షలకు పెంచాలని నాయకులు అన్నారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఒకరోజు నిరాహార దీక్ష చేపడుతున్నట్లు మండల కార్యదర్శి జగన్ శుక్రవారం తెలియజేశారు. పార్టీలకు అతీతంగా పెద్దసంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

చేవెళ్ల సభకు తరలిరండి

స్టేషన్ మహబూబ్‌నగర్: చేవెళ్లలో జరిగే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభలో జిల్లాలోని దళిత, గిరిజనులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా దళిత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.సాయిబాబా కోరారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ముఖ్య అతిథిగా హాజరై ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను విడుదల చేస్తారని వివరించారు. ఎస్సీసెల్ పాల్గొన్నారు.

నవాబుపేట: చేవేళ్లలో శనివారం నిర్వహించే కాంగ్రెస్ ప్రజాగర్జనను విజయవంతం చేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి బంగ్లరవి శుక్రవారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కోరారు. పెద్దఎత్తున తరలి రావాలని అన్నారు.

ఖోఖోలో సత్తాచాటాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: ఖోఖోలో జిల్లా క్రీడాకారులు సత్తాచాటాలని సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ సూర్యప్రకాశ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శుక్రవారం బాల, బాలికల జట్లకు ఖోఖో ఫ్రెండ్లీమ్యాచ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. ఖోఖోలో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్నట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు వడన్న, రాజవర్ధన్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు దారుణం



పాలమూరు: బీజేపీ పాలమూరు శాఖ ఆధ్వర్యంలో నాయకులు గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. బీజేపీ కార్యాలయం నుంచి ర్యాలీగా ఎమ్మెల్యే క్యాంపు వరకు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ క్రమంలో వారిని టూటౌన్ పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. పాండురంగారెడ్డి, అంజయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

మిడ్జిల్: ప్రజల సమస్యలపై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బీజేపీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమానికి నాయకులు వెళ్లకుండా శుక్రవారం మిడ్జిల్ పోలీసులు వారిని ముందస్తు అరెస్టు చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్ అక్రమంగా అరెస్టు చేయించడం దారుణమన్నారు. మండల అధ్యక్షుడు నరేందర్, తిరుపతి ఉన్నారు.

రాజాపూర్: మండల అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు ఆనంద్, ఆదిత్యా, సూరి తదితరులను రాజాపూర్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.

కుష్టు నిర్మూలనకు కృషి

మహబూబ్‌నగర్ రూరల్: కుష్టు నిర్మూలనకు కృషిచేద్దామని ఎల్‌డీసీ బృందం సభ్యులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లాకేంద్రంలోని న్యూమోతి నగర్ యూపీహెచ్‌సీని సందర్శించారు. కుష్టు వ్యాధిగ్రస్తుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో స్టేట్ టీం సభ్యులు మజర్, శివ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయం



మహబూబ్‌నగర్ రూరల్: ప్రజల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల దివ్యాంగులకు పెంచిన పెన్షన్లను మండల పరిధిలోని కోటకదిర గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. అంతకుముందు సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సర్పంచ్ మల్లు రమ్య, కోఆప్షన్ సభ్యుడు ఎండీ మస్తాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ డి.నర్సింహులు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు మల్లప్ప, పాపన్న, రాములు, వెంకటేష్ పాల్గొన్నారు.

'సంక్షేమ' విద్యార్థులకు వసతులు కల్పించాలి

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాలోని సంక్షేమ వసతిగృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కావలి పరశురాం, కార్యదర్శి కుర్మయ్య, ఉపాధ్యక్షుడు ఆది విష్ణువర్ధన్ డిమాండ్ చేశారు. శుక్రవారం సాంఘిక సంక్షేమశాఖ సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వసతిగృహాల విద్యార్థుల మెనూ వారం రోజుల్లో మారకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

బీజేపీని బలోపేతం చేయాలి



బాలానగర్: బీజేపీని బూత్‌లెవల్ నుంచి బలోపేతం చేయాలని అప్పుడే లక్ష్యాన్ని సాధిస్తామని కర్ణాటక ఎమ్మెల్యే విజేంద్ర యడ్యూరప్ప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బూత్ లేవల్ మీటింగ్‌కు ముఖ్య అతిథి హాజరై దిశానిర్దేశం చేశారు. పటిష్టత కోసం పనిచేయాలని పేర్కొన్నారు. జిలా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, బాలా త్రిపురా సుందరీదేవి, మండల అధ్యక్షుడు శ్రీశైలం పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి సాయం



భూత్పూర్: హస్నాపూర్‌కి చెందిన నర్సింహులు 15 రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబానికి శుక్రవారం ఆయన మిత్రులు (1996–97 పదోతరగతి బ్యాచ్) రూ.41వేల ఆర్థికసాయం అందజేశారు. గడ్డం ఎల్లప్ప, శివశంకర్ గౌడ్, పేట శ్రీను, బాల్‌రాజ్, రామస్వామి ఉన్నారు.

మహమ్మదాబాద్: వెంకట్‌రెడ్డిపల్లికి చెందిన వెంకటయ్య అనారోగ్యంతో మరణించగా.. ఆయన మిత్రులు(1999–2000 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్) రూ.63వేలు పోగు చేసి శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కొండల్‌రెడ్డి, గిరి, వెంకటేశ్, ధర్మాపూర్ సర్పంచ్ వెంకటయ్య, దాసకారి సురేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా బోనాల పండుగ



అడ్డాకులలో బోనాలతో బొడ్రాయి చుట్టు ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు



గంగాపురంలో..



బంగారు మైసమ్మను దర్శించుకున్న శివసేనారెడ్డి, ఫిరోజ్‌ఖాన్ తదితరులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని బంగారుమైసమ్మ, గంగాపురం రేణుకాఎల్లమ్మ ఆలయాల్లో బోనాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు.

అడ్డాకుల: మండల కేంద్రంలో శుక్రవారం పోచమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

దేవరకద్ర రూరల్: గోపన్‌పల్లిలో శుక్రవారం పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ రజిత పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని బంగారుమైసమ్మ బోనాల ఉత్సవంలో యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, రాష్ట్ర నాయకుడు ఫిరోజ్‌ఖాన్ శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక యూత్‌కాంగ్రెస్ నాయకులు భారీ బైక్‌ర్యాలీతో స్వాగతం పలికారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా బిందేశ్వరీప్రసాద్ జయంతి



జడ్చర్ల టౌన్: బీసీ రిజర్వేషన్ ప్రదాత బిందేశ్వరీ ప్రసాద్ మండల్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండలకేంద్రంలోని పూలే విగ్రహం వద్ద ఆయనకు ఘన నివాళి అర్పించారు. బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్, ప్రజాసంఘాల నాయకులు శ్రీనివాస్, శేఖర్‌యాదవ్, జహంగీర్ పాష, సత్తయ్య, గోపాల్, విజయ్‌కుమార్, శ్రీనివాస్, శేఖర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బిందేశ్వర్ ప్రసాద్ మండల్ జయంతిని జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులు గురుప్రసాద్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సీపీఎస్ రద్దు, పీఆర్సీ కమిటీ ఏర్పాటు, ఐఆర్ ప్రకటన, బదిలీలో, పదోన్నతుల కోసం వచ్చే నెల 1న హైదరాబాద్‌లో చేపట్టే మహాధర్నా విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. నాయకులు రవికుమార్, వెంకటేష్, ఆదిత్య, వెంకటేశ్వర్లు, మహమూద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రారంభానికి ఏర్పాట్లు

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో శనివారం జూనియర్ కళాశాల ప్రారంభించనున్నట్లు సర్పంచ్ పార్వతమ్మ తెలిపారు. ఇటీవలె కొత్త కళాశాల మంజూరు కావడంతో నిర్వహించేందుకు ఉన్నత పాఠశాల ఆవరణలో గదులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ మేరకు సౌకర్యాలను కల్పించినట్లు వివరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి హాజరుకానున్నట్లు వివరించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

అడ్డాకుల: యువతీ, యువకులు తప్పకుండా తమ ఆరోగ్యంపై శ్రద్ధ కలిగి ఉండాలని మండల ఆయుర్వేద వైద్యురాలు లావణ్య సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆయూష్‌శాఖ ద్వారా వైద్య శిబిరాన్ని నిర్వహించి విద్యార్థులకు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. ఆయుర్వేద చికిత్స విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంజన్‌కుమార్, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

అందుబాటులో ఉండాలి

నవాబుపేట: రేషన్ డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన డీలర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరించరాదన్నారు. సమావేశంలో ఆర్‌ఐలు గోవర్ధన్, కిరణ్, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.